# తొలివెలుగు

జాతీయ దినపత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 186 | బుధవారం | 22-7-2026

PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08







# ప్రధాని నివాసం 'యుద్ధరంగం'

**విద్యార్థులపై దమనకాండకు బాధ్యత వహించాలి.. మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్**



- ఖర్గే, రాహుల్, ప్రియాంక, డీకే శివకుమార్, వీడీ సతీశన్ బైఠాయింపు
- నాలుగు గంటలపాటు ధర్నా... మోదీకి వ్యతిరేకంగా నినాదాలు
- ప్రభుత్వ దూతగా చర్చలు జరిపిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- నీట్--యూజీపై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడి
- అంగీకరించని ప్రతిపక్ష నేతలు.. రాజీనామా డిమాండ్‌పై పట్టు
- విపక్ష నేతలను బలవంతంగా అరెస్టు చేసిన పోలీసులు
- తోపులాటలో రాహుల్ గాంధీకి గాయాలు.. ముక్కు నుంచి రక్తం
- నిర్బంధం నుంచి రాహుల్, ప్రియాంక, అఖిలేష్ విడుదల

న్యూఢిల్లీ: నీట్--యూజీ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాల ధర్నాతో ఢిల్లీ లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధానమంత్రి నివాస ప్రాంతం అట్టుడికింది. న్యాయం చేయాలని కోరిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని విపక్షాలు మంగళవారం గొంతెత్తాయి. కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, కేరళ సీఎం వీడీ సతీశన్ సహా పలు పార్టీల ఎంపీలు, నేతలు హైసెక్యూరిటీ జోన్ అయిన

- మిగతా 2వ పేజీలో

# పేపర్ లీకేజీ... ఘోరమైన పాపం

- దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- సమర్థులైన లాయర్లను నియమించాం
- యువత భవిష్యత్తుతో రాజకీయాలు వద్దు
- లీకేజీ జాఢ్యాన్నిఅంతం చేయాల్సిందే
- ఇందుకోసం కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలి
- 'మంగళ్ మిలన్' భేటీలో ప్రధాని మోదీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించిన నీట్--యూజీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారిగా స్పందించారు. ప్రశ్నపత్రాలను లీక్ చేయడం 'ఘోరమైన పాపం'గా అభివర్ణించారు. ఈ పాపానికి ఒడిగట్టినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు.

- మిగతా 2వ పేజీలో



# ఎల్‌నీనో ఎఫెక్ట్..
# తెలంగాణలో డ్రౌట్ అలర్ట్.!

- వర్షాభావంపై ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ
- వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై ఫోకస్
- దేవాదుల తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం
- రైతులు ఆందోళన చెందొద్దన్న మంత్రులు

రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

- మిగతా 2వ పేజీలో

# నారా లోకేశ్ వచ్చిన తర్వాతే మాకు గుర్తింపు వచ్చింది...

- మంగళగిరిలో ఇంటి పట్టాల లబ్ధిదారుల హర్షం
- మంగళగిరిలో శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి నారా లోకేశ్
- ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారని లబ్ధిదారుల హర్షం
- లోకేశ్ వచ్చిన తర్వాతే తమకు గుర్తింపు దక్కిందని స్థానికుల ఆనందం
- దశాబ్దాల తమ నిరీక్షణకు తెరపడిందని లబ్ధిదారుల భావోద్వేగం
- నియోజకవర్గ అభివృద్ధిపై లోకేశ్‌కు ప్రశంసలు





# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్..


- దావోస్‌లో కుదిరిన ఒప్పందానికి కార్యరూపం
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ భేటీ
- మామిడి, అరటి వంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పనే లక్ష్యం
- ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య కుదిరిన కీలక భాగస్వామ్యం

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో కుదిరిన మరో కీలక ఒప్పందం కార్యరూపం దాల్చే దిశగా ముందడుగు పడింది. రాష్ట్రంలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ ఏడాది దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిపిన చర్చల సందర్భంగా ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందాన్ని ఆచరణలోకి తీసుకురావడంలో భాగంగా యూఏఈ ప్రతినిధులు అమరావతికి వచ్చారు.

- మిగతా 2వ పేజీలో

# సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి

- యలమంచిలి నియోజకవర్గంలో పంచదార్ల కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్ చేస్తున్నారన్న బొత్స
- కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని వెల్లడి
- స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి దోపిడీ చేస్తున్నారని ఆరోపణ



అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం, రాంబిల్లి మండలంలోని పంచదార్ల గ్రామంలో ఉన్న ఫణిగిరి కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

- మిగతా 2వ పేజీలో

# 'సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదు'..

- కాక్రోచ్ పార్టీ ర్యాలీకి కేటీఆర్ మద్దతు
- విద్యార్థులపై పోలీసు చర్యలను ఖండించిన కేటీఆర్
- ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉందని వ్యాఖ్య
- విభేదాల గొంతు నొక్కే ప్రయత్నం ఆపాలంటూ కేంద్రానికి చురకలు
- విద్యార్థులకు సంఘీభావం ప్రకటించిన బీఆర్ఎస్ నేత
- ఈ ప్రతిఘటనను పది నెలల క్రితమే ఊహించినట్లు వెల్లడి

2లో



# దేవాదుల పంపింగ్ యూనిట్లు స్టార్ట్

- పూర్తి సామర్థ్యంతో పనిచేయనున్న 9 పంపింగ్ యూనిట్లు
- గోదావరి నీటితో 22 రిజర్వాయర్లను నింపడమే లక్ష్యం: ఉత్తమ్
- తాగు, సాగునీటి భద్రతకే తొలి ప్రాధాన్యం



హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారంరాత్రి నుంచే దేవాదుల ప్రాజెక్టుకు చెందిన 9 పంపింగ్ యూనిట్లను 24 గంటల పాటు పూర్తి సామర్థ్యంతో నడపనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

- మిగతా 2వ పేజీలో

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# ఎల్‌నీనో ఎఫెక్ట్.. తెలంగాణలో డ్రౌట్ అలర్ట్.!

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ఌ పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా ఌ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటి స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు.



## ప్రధాని నివాసం 'యుద్ధరంగం'

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించారు. అక్కడే బైఠాయించారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నినాదాల హోరుతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో అరుపులు, తోపులాటలతో యుద్ధ రంగాన్ని తలపించింది. దాదాపు 20 నిమిషాల తర్వాత కేంద్ర ప్రభుత్వ దూతగా కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్‌తో కలిసి ధర్నా స్థలికి చేరుకున్నారు. నిరసన విరమించాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో ఫోన్‌లో మాట్లాడారు. నీట్--యూజీపై పార్లమెంట్‌లో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అందుకు కాంగ్రెస్ నేతలు అంగీకరించలేదు. మోదీ రాజీనామా చేయాల్సిందేనని, లేకపోతే రాత్రంతా ఇక్కడే ఉంటామని తేల్చి చెప్పారు. చేసేది లేక జితేంద్ర సింగ్ వెనుదిరిగారు. ప్రభుత్వం ప్రజల స్వేచ్ఛపై ఆంక్షలు విధించిందని ఆరోపిస్తూ ప్రతిపక్ష నేతలు తమ చేతులను తాళ్లతో కట్టేసుకున్నారు. దాదాపు నాలుగు గంటలపాటు ధర్నా కొనసాగింది. చివరకు పోలీసులు ప్రతిపక్ష నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకొని వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. విద్యార్థులపై దాడి అంటే ప్రతి భారతీయ కుటుంబంపై దాడి జరిగినట్లేనని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఎలాంటి సమాధానాలు చెప్పకుండా, ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోకుండా తప్పించుకోగలనని ప్రధాని మోదీ భావిస్తున్నారని.. కానీ, ఈసారి అలా చేయడం కుదరదని తేల్చిచెప్పారు. ధర్నా సందర్భంగా ఆయన మాట్లాడారు. మన విద్యార్థులకు న్యాయం జరగాలని విశ్వసించే దేశభక్తి గల ప్రతి భారతీయుడు ఈ ధర్నాలో తమతో చేరాలని రాహుల్ కోరారు. విద్యార్థుల గళాన్ని ఎవరూ విస్మరించలేరని చెప్పారు. "సోమవారం విద్యార్థులపై జరిగిన అరాచకాలకు సంబంధించి ప్రధాని మోదీ నుంచి సమాధానం కోరేందుకు ఆయన నివాసానికి ర్యాలీగా వెళ్లాం. జరిగిన దానికి బాధ్యత వహించడానికి గానీ, దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరపడానికి గానీ ప్రభుత్వం ఇష్టపడటం లేదు. యువత భవిష్యత్తును నాశనం చేసినందుకు ప్రధానమంత్రి, హోం మంత్రి రాజీనామా చేయాలి. విద్యార్థుల హక్కులు, వారి న్యాయమైన డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది" అని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. "విద్యార్థులపై లాఠీచార్జి, బలప్రయోగం చేసినందుకు ఈ పిరికిపంద, నియంతృత్వ ప్రభుత్వం సమాధానం చెప్పక తప్పదు. మోదీ, అమిత్ షా మన యువత పట్ల తప్పు చేశారు. వారు పదవుల నుంచి తప్పుకోవాల్సిందే" అని మల్లికార్జున ఖర్గే తేల్చిచెప్పారు. విద్యార్థులకు న్యాయం చేసి, వారి డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే దాకా తమ పోరాటం ఆపబోమని కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా పేర్కొన్నారు. న్యాయం జరిగే వరకూ వెనక్కి తగ్గబోమన్నారు. పోలీసులు తమపై బలప్రయోగం చేశారని కొందరు ఎంపీలు ఆరోపించారు. సోమవారం జరిగిన లాఠీచార్జిలో గాయపడి రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి నివాసం ఎదుట బైఠాయించిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌ను పోలీసులు బలవంతంగా అరెస్టుచేశారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పోలీసులను కాంగ్రెస్ శ్రేణులు ప్రతిఘటించేందుకు ప్రయత్నించాయి. పోలీసులను తనను అరెస్టు చేసే సమయంలో రాహుల్ గాంధీ నేలపై పడుకొని కనిపించారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో ఆయనకు స్వల్ప గాయమైంది. రాహుల్‌కు, అఖిలేష్ యాదవ్‌ను పోలీసులు నిర్బంధించి, ఛత్రసాల్ స్టేడియంకు తరలించారు. "భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రస్తుతం అమలవుతోంది" అని రాహుల్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

## సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి

(మొదటి పేజీ తరువాయి)

'ఛలో పంచదార్ల' పేరిట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి పంచదార్ల కొండలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... పంచదార్ల కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి ఈ కొండలను దారుణంగా దోపిడీ చేస్తున్నారని, ఇది చిన్న చిన్న వ్యక్తులు చేస్తున్న అక్రమ మైనింగ్ కాదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నిత్యం సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి పెద్దలకు కళ్లు ఉంటే ఇక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వచ్చి చూడాలి. ఈ ధర్మ పోరాటం ప్రజా ఉద్యమంలా మారకముందే జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. పంచదార్ల కొండల దోపిడీపై తాము ప్రశ్నిస్తుంటే కూటమి నేతలు ఇందులో ఏదో కుట్ర దాగి ఉందని అనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పవిత్రమైన కొండలను దోచుకుంటున్న కూటమి నేతలకు ఆ దేవుడి పాపం తప్పక తగులుతుందని, శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రేపటి కల్లా పంచదార్ల కొండపై మైనింగ్ వాహనాలు కనిపిస్తే అక్రమ మైనింగ్ ఆపే వరకు నడిరోడ్డుపైనే ధర్నాలు చేస్తామని, ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని బొత్స స్పష్టం చేశారు.

## నారా లోకేశ్ వచ్చిన తర్వాతే మాకు గుర్తింపు వచ్చింది...

మంగళగిరి నియోజకవర్గంలో పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తామన్న హామీని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో ఆయన వందలాది మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న తమ కల నెరవేరిందంటూ లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. లోకేశ్ వచ్చిన తర్వాతే తమకు ఓ గుర్తింపు లభించిందని పలువురు భావోద్వేగంతో తెలిపారు. గతంలో ఎన్నికల ప్రచార సమయంలోనూ, యువగళం పాదయాత్ర సందర్భంగానూ మంగళగిరిలో అర్హులైన పేదలందరికీ శాశ్వత గృహ హక్కు పట్టాలు అందిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ హామీని నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు పట్టాలతో పాటు నూతన వస్త్రాలు అందించి, భోజన సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు తమ అనుభవాలను, ఆనందాన్ని పంచుకున్నారు.

## ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్..

(మొదటి పేజీ తరువాయి)

ఆహార శుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక పూర్తిస్థాయి వ్యాల్యూచైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. దీనికోసం ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య అధికారికంగా భాగస్వామ్యం కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రంలో అధికంగా పండే మామిడి, అరటి, కోకో వంటి ఉద్యాన ఉత్పత్తులను శుద్ధి చేసి, నాణ్యతా ప్రమాణాలతో ప్యాక్ చేసి, అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇది రాష్ట్రంలోని రైతులకు మేలు చేయడంతో పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కీలక సమావేశంలో యూఏఈ ప్రతినిధులతో పాటు రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖల ఉన్నతాధికారులు, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) అధికారులు పాల్గొన్నారు.

## 'సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదు'..

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. యువత ఆవేదనను పట్టించుకోకపోతే దేశంలో 'జెన్-జెడ్' ఉద్యమం తప్పదని తాను పదినెలల కిందటే చెప్పానని గుర్తుచేశారు. ఢిల్లీలో జరిగిన నిరసనల తర్వాతైనా కేంద్రం జవాబుదారీతనం చూపించి, విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు కల్పించిందని పేర్కొన్నారు. విభేదాల గొంతు నొక్కే ప్రయత్నాలను కేంద్రం వెంటనే ఆపాలని, జవాబుదారీతనం కోసం పోరాడుతున్న విద్యార్థులకు తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

## దేవాదుల పంపింగ్ యూనిట్లు స్టార్ట్

(మొదటి పేజీ తరువాయి)



గోదావరి నదిలో అందుబాటులో ఉన్న నీటిని సాధ్యమైనంత ఎక్కువగా ఎత్తిపోసి దేవాదుల పరిధిలోని 9 జిల్లాలకు చెందిన 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సచివాలయంలో మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి వెల్లడించారు. ఇటీవల దేవాదుల ప్రాజెక్టుపై మంత్రుల బృందం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టిందని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో నీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా చూడడంతో పాటు రైతులకు అవసరమైన సాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అందుకే దేవాదుల పంపులను 24 గంటలు నిరంతరాయంగా నడిపే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గోదావరి నుంచి ఎత్తిపోసే నీటిని వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, భూపాలపల్లి తదితర జిల్లాల్లోని రిజర్వాయర్లకు చేరేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రిజర్వాయర్లు నిండితే సాగునీటితోపాటు తాగునీటి సమస్య కూడా చాలా వరకు పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టుపై కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టుపై ప్రభుత్వాన్ని విమర్శించే ముందు కాళేశ్వరం ప్రాజెక్టులో తీసుకున్న నిర్ణయాలపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో మొదట రూపొందించిన షీట్ పైల్ ఫౌండేషన్ డిజైన్‌ను మార్చి సెకెంట్ పైల్ ఫౌండేషన్‌ను ఎందుకు అమలు చేశారో వివరించాలని ప్రశ్నించారు. ఆ నిర్ణయాల వల్లే ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోందని ఆరోపించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణలను కూడా మంత్రి ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ల నుంచి బీఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు వెళ్లాయని కవిత చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేవాదుల ఎత్తిపోతల పథకం మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, భూసేకరణ, అటవీ అనుమతులు, ఇతర పరిపాలనా అనుమతులు, నిర్మాణ పనులను వేగవంతం చేసి 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తిగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం అని చెప్పారు.

# పేపర్ లీకేజీ... ఘోరమైన పాపం

(మొదటి పేజీ తరువాయి)

యువత భవిష్యత్తుతో ఆటలాడితే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టంచేశారు. మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో 'మంగళ్ మిలన్'పేరిట జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తమ కూటమి ఎంపీలను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. పేపర్ లీక్ అనేది పార్టీల రాజకీయాలకు సంబంధించిన అంశం కాదని.. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశమని వెల్లడించారు. ఈ జాఢ్యాన్ని అంతం చేయడానికి కేంద్రం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో ఆప్యాయత, అనురాగంతో సన్నిహిత సంబంధాలు కొనసాగించాలని, యువత విశ్వాసాన్ని పొందాలని ఎన్డీయే ఎంపీలకు సూచించారు. 'మంగళ్ మిలన్'ముగిసిన అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. మోదీ ప్రసంగం వివరాలను వెల్లడించారు. ప్రశ్నపత్రం లీక్ అయినట్లు వార్తలు రాగానే ప్రభుత్వం తక్షణమే స్పందించిందని, 13 మందిని అరెస్టు చేసి జైలుకు పంపిందంటూ ప్రధానమంత్రి చెప్పారని వెల్లడించారు. ఈ సమావేశం ఎంతో ఫలప్రదంగా సాగిందని, ప్రధాని అనేక ముఖ్యమైన అంశాలపై మాట్లాడారని రిజిజు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా 'నీట్'పునఃపరీక్షకు ప్రాధాన్యతనిచ్చి?చ, దానిని విజయవంతంగా నిర్వహించి, ఫలితాలను ఎటువంటి జాప్యం లేకుండా ప్రకటించినట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పేపర్ లీక్‌లు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా ఉంటుందన్నారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో రాజకీయాలు చేయడం తగదని పేర్కొన్నారు. యువత విశ్వాసాన్ని పొందాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా యువతతో మమేకం కావాలన్నారు. వారి ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించాలని చెప్పారు. నీట్ పేపర్ లీకేజీలో ప్రమేయం ఉన్నవారికి కఠిన శిక్ష పడేలా చూసేందుకు అత్యంత సమర్థులైన న్యాయవాదులను రంగంలోకి దించినట్లు గుర్తుచేశారు. దోషులను శిక్షించాలని, పేపర్ లీకేజీలు జరగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఉద్ఘాటించారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని అన్నారు. వారిని తప్పుదోవ పట్టించడం సులభమే అయినప్పటికీ సరైన మార్గంలో నడిపించడం మాత్రం కష్టమని వ్యాఖ్యానించారు. వారు మంచిమార్గంలో నడిచేలా చూడడం మనందరి బాధ్యత అని స్పష్టంచేశారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ, యువత భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. అలాగే గత కొన్ని నెలల్లో దేశం సాధించిన విజయాల మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇటీవల అనేక దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల(ఎఫ్‌టీఏ) గురించి ఎన్డీయే ఎంపీలకు వివరించారు. ఈ ఒప్పందాలతో మన రైతాంగానికి, మన దేశానికి లాభమే తప్ప ఎలాంటి నష్టం జరగదన్నారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. దేశ శ్రేయస్సు కోసం జీవితంలోని ప్రతి క్షణాన్నీ అంకితం చేయాలని ఎంపీలను కోరారు. "దేశమే ప్రథమం, దేశ పురోగతి, సంక్షేమం కోసం మనం నిరంతరంకృషి చేయాలి"అని పిలుపునిచ్చారు. కొత్తగా రాజ్యసభకు ఎన్నికైన సభ్యులకు ప్రధానమంత్రి అభినందనలు తెలియజేశారు.



## ప్రత్యామ్నాయ పంటలతోనే అధిక లాభాలు



- వర్షాభావ పరిస్థితుల్లో మునగ, పప్పుదినుసుల సాగు మేలు
- రైతుల అవగాహన సదస్సులో ఏఓ పద్మజ

**తొలివెలుగు, రాజాపేట:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పద్మజ సూచించారు. ఎలినో ప్రభావం వల్ల అనుకున్న స్థాయిలో వర్షాలు కురవడం లేదని, ఇలాంటి సమయంలో పప్పు దినుసులు, మునగ వంటి పంటలను సాగు చేయడమే మేలైన మార్గమని చెప్పారు. మంగళవారం మండలంలోని పాముకుంట గ్రామంలో నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఏఓ, అనంతరం గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో భూమి సారం పెరగడమే కాకుండా, రైతులకు మంచి ఆదాయం సమకూరుతుందని స్పష్టం చేశారు. ఆయా పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- రాజాపేట మండలంలో రెండు పోస్టుల భర్తీ
- అర్హులైన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకోవాలి

**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని రెండు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సోమారం గ్రామంలో 'ఓసీ' కేటగిరీకి, కొండ్రెడ్డిచెరువు గ్రామంలో 'బీసీ-సీ' కేటగిరీకి ఈ పోస్టులను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ పూర్తిచేసి 35 సంవత్సరాల లోపు ఉన్న స్థానిక మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు అటెస్టేషన్ చేసిన జిరాక్స్ కాపీలను ఆలేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు. పదో తరగతి, ఇంటర్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ప్రత్యేక వర్గాలకు చెందిన వారైతే సంబంధిత పత్రాలు జత చేయాల్సి ఉంటుందన్నారు.

## కాల్వపల్లి పైలట్ గ్రామంగా ఎంపిక కావడంపై హర్షం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు
- జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఇంజ నరేష్



**తొలివెలుగు, రాజాపేట:** భూముల పునః సర్వే అవగాహన కార్యక్రమంలో భాగంగా కాల్వపల్లిని పైలట్ గ్రామంగా ఎంపిక చేయడం సంతోషదాయకమని యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, రైతు ఇంజ నరేష్ తెలిపారు. కాల్వపల్లిని ఎంపిక చేయించినందుకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం కాల్వపల్లిలో నిర్వహించిన భూ పునః సర్వే గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక ప్రత్యేక పథకాలను అమలు చేస్తోందన్నారు. భూమి సేద్యం నుంచి పండించిన పంటను విక్రయించే వరకు ప్రభుత్వం అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తోందని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, కార్యక్రమానికి హాజరైన అధికారులకు కాల్వపల్లి రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. తమ గ్రామంలో ఈ సభ నిర్వహించడం పట్ల గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## సిబ్బంది జీతాలు నమిలేసిన పంచాయతీ కార్యదర్శి

- న్యాయం చేయకపోతే విధుల బహిష్కరణ హెచ్చరిక
- ఎంపీడీవో నాగవేణికి 'బొందుగుల' జీపీ సిబ్బంది ఫిర్యాదు




**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బొందుగుల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తమ మూడు నెలల వేతనాలను సొంతానికి వాడుకున్నారని ఆరోపిస్తూ 14 మంది సిబ్బంది మంగళవారం ఎంపీడీవో నాగవేణికి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ ద్వారా అందాల్సిన తమ వేతన సొమ్మును పంచాయతీ కార్యదర్శి సకాలంలో ఇవ్వకుండా వేధిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే తమ వేతనాలు ఇప్పించి, సదరు కార్యదర్శిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కాగా, జూన్ 8న నిధుల దుర్వినియోగంపై సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య ఎంపీడీవో, ఎంపీవోలకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని... వారి అలసత్వం వల్లే నేడు సిబ్బంది వేతనాలు కూడా దుర్వినియోగానికి గురయ్యాయని గ్రామస్తులు ఆరోపించారు.

# 'బాట' లేక... చావుబ్రతుకుల మధ్య పోరాటం

- పిట్టలగూడెంలో పాముకాటుకు గురైన వ్యక్తికి నరకయాతన
- దారి లేక మోసుకెళ్లిన గ్రామస్తులు.. నాయకుల నిర్లక్ష్యంపై ఆగ్రహం





**తొలివెలుగు, రాజాపేట:** రహదారి సౌకర్యం లేకపోవడంతో పాముకాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడిన ఘటన రాజాపేట మండలంలో చోటుచేసుకుంది. అత్యవసర పరిస్థితుల్లో కూడా గ్రామానికి సరైన దారి లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు మండిపడ్డారు. గ్రామస్తుల వివరాల ప్రకారం... మండలంలోని నమిల మధిర గ్రామ పంచాయతీ పరిధిలోని పిట్టలగూడెం గ్రామానికి చెందిన రామోజీ సోమవారం అర్ధరాత్రి పెంజర పాము కాటుకు గురయ్యాడు. వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు గ్రామస్తులు ప్రయత్నించినప్పటికీ, గ్రామం నుంచి బయటకు వెళ్లేందుకు సరైన దారి లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. దీంతో బాధితుడిని కొంతదూరం వరకు గ్రామస్తులే భుజాలపై మోసుకెళ్లాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న నమిల గ్రామానికి చెందిన మేక వెంకటేశ్వర రెడ్డి వెంటనే స్పందించి తన సొంత కారులో రామోజీని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అదే కారులో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రామోజీ అక్కడ చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**ఏళ్లుగా దారి సమస్య.. పట్టించుకోని పాలకులు:**

పిట్టలగూడెం గ్రామానికి సరైన రహదారి ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా గ్రామస్తులు ప్రాణాలను పణంగా పెట్టి బాధితులను మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి తక్షణమే రహదారి నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

# స్వాములవారి లింగోటంలో ఉచిత వైద్య శిబిరం





- గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ చేతుల మీదుగా ప్రారంభం
- టీబీ ముక్త్ భారత్, ఎన్‌సీడీ కార్యక్రమాల కింద ఉచిత వైద్య పరీక్షలు.. మందుల పంపిణీ
- ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ

**తొలివెలుగు, చౌటుప్పల్ :** గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా స్వాములవారి లింగోటం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్, నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కార్యక్రమాల కింద నిర్వహించిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శిబిరంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

**టీబీ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు:**

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 14 సంవత్సరాలు పైబడిన వారిలో రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బలహీనత, బరువు తగ్గడం వంటి లక్షణాలతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా డిజిటల్ ఛాతీ ఎక్స్-రే పరీక్షలు నిర్వహించారు. అలాగే టీబీ రోగులతో సన్నిహితంగా ఉన్న వ్యక్తులకు కూడా స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి తదుపరి వైద్య పరీక్షలు సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

**బీపీ, షుగర్ పరీక్షలు - ఉచిత మందుల పంపిణీ:**

నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కార్యక్రమం కింద గ్రామ ప్రజలకు రక్తపోటు, మధుమేహం (షుగర్) పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో సమస్యలు గుర్తించిన వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల ఆహారం, వ్యాయామం వంటి అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు.

**వ్యాధులను ముందుగానే గుర్తిస్తే చికిత్స సులభం:**

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎన్నో ఉచిత వైద్య కార్యక్రమాలు అమలు చేస్తోందని అన్నారు. గ్రామ ప్రజలు ఇటువంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని సమయానికి పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని తెలిపారు. ముఖ్యంగా టీబీ వంటి అంటువ్యాధుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ప్రజల నుంచి విశేష స్పందన:**

శిబిరానికి గ్రామంలోని మహిళలు, వృద్ధులు, యువత అధిక సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు, మందులు అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కాటంరాజు, ఉపసర్పంచ్ బాతరాజు ధనంజయ, వార్డు సభ్యులు బాతరాజు ఫకిరు పద్మ, పిట్టల శోభా సాధనందం, శేగురి లింగస్వామి, రాధారపు సత్తయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరించారు.





# 'మీసేవలో పేపర్‌లెస్ సేవలు'


- రసీదులు ఇక మొబైల్, వాట్సప్‌లకే: ఈడీఎమ్ ఎన్. సాయి కుమార్
- రాజాపేట మండలంలో మీసేవ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మీసేవ కేంద్రాల్లో కాగిత రహిత (పేపర్‌లెస్) సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా ఈ-డిస్ట్రిక్ మేనేజర్ (ఈడీఎమ్) ఎన్. సాయి కుమార్ తెలిపారు. మంగళవారం రాజాపేట మండలంలోని పలు మీసేవ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కాగిత రహిత పాలనలో భాగంగా ఇకపై మీసేవలో సేవలకు సంబంధించిన ముద్రిత రసీదులు ఇవ్వబడవని స్పష్టం చేశారు. చెల్లింపు వివరాలు నేరుగా దరఖాస్తుదారుల మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్, వాట్సప్ రూపంలో చేరుతాయన్నారు. దరఖాస్తుదారులు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా 'జీపీవో'ల మొబైల్ యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లోనే సేవలు పొందే వెసులుబాటు ఉందన్నారు. కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన అధికారిక రుసుము మాత్రమే వసూలు చేయాలని, అదనపు బాదుడుకి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రాజాపేట మండల గిర్దావర్ నర్సింహులు, డీఎం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# భూ సర్వేతో స్పష్టమైన హద్దులు

- బసంతాపురం, కాల్వపల్లిలో 'భూ భారతి' అవగాహన సదస్సులు
- రైతుల సందేహాలకు సమాధానాలిచ్చిన తహసీల్దార్ రవికిరణ్

**తొలివెలుగు, రాజాపేట :** గ్రామీణ ప్రాంతాల్లోని భూములకు స్పష్టమైన సరిహద్దులు నిర్ధారించి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'భూ భారతి' రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని రాజాపేట తహసీల్దార్ గోలి రవికిరణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని బసంతాపురం, కాల్వపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొని రైతులకు పలు అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, చెరువులు, కుంటలు, పట్టా భూములు సహా అన్ని భూములకు శాస్త్రీయ పద్ధతిలో కొలతలు నిర్వహించి స్పష్టమైన సరిహద్దులు నిర్ణయిస్తామని చెప్పారు. దీంతో భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న రైతులు రీ-సర్వే ప్రక్రియ, హద్దుల నిర్ధారణ, రికార్డుల సవరణ తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు తహసీల్దార్ రవికిరణ్ వివరంగా సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో బసంతాపురం సర్పంచ్ మెండు రత్నమాల, కాల్వపల్లి సర్పంచ్ ఇంజ లక్ష్మి, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి

- హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్న మహిళా సమాఖ్య
- రాజాపేట మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**తొలివెలుగు, రాజాపేట :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని యాదాద్రి భువనగిరి జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ విమర్శించారు. మంగళవారం రాజాపేటలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళలకు స్వేచ్ఛ, భద్రత ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు, గృహహింస, లైంగిక వేధింపులను అరికట్టేందుకు పోక్సోతో పాటు ఇతర చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం, ఇంజ హేమలత, తరిగొప్పుల సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

**మహిళా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక:** సమావేశం అనంతరం భారత జాతీయ మహిళా సమాఖ్య రాజాపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా ఇంజ హేమలత, అధ్యక్షురాలిగా ఎలగందుల కల్పన, ప్రధాన కార్యదర్శిగా కె. చంద్రకళ ఎన్నికయ్యారు. సభ్యులుగా జంగలక్ష్మి, జ్యోతి, శ్యామల, కవితలను ఎంపిక చేశారు. నూతన కమిటీ సభ్యులకు సమావేశంలో పాల్గొన్న నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



# స్థానిక సమస్యలపై పోరుబాట!

- ఆగస్టు 1 నుంచి భాజపా పాదయాత్ర
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం: ఫకీర్ రాజేందర్‌రెడ్డి

**తొలివెలుగు, రాజాపేట :** మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1వ తేదీ నుంచి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు భాజపా కిసాన్ మోర్చా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, రాజాపేట మండల ప్రభారి ఫకీర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాజాపేటలో భాజపా మండల అధ్యక్షుడు మేకల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా ప్రజలను కలిసి వారి ఇబ్బందులను తెలుసుకుంటూ పాదయాత్ర చేపడతామని తెలిపారు. మండలంలోని గొలుసుకట్టు చెరువులను పూర్తిస్థాయిలో నింపే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాగులపై నిర్మాణంలో ఉన్న వంతెనలను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఉపయోగపడేలా 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే పాదయాత్ర ద్వారా ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచ్ కోయ మధు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కస్తూరి మాధురి, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, నాయకులు కాయితీ బాలిరెడ్డి, వినోద్, సంపత్, నర్సింగరావు, భగవాన్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'ది నవాబ్స్' రెస్టారెంట్ ప్రారంభం

- దిల్‌సుఖ్‌నగర్‌లో రాయల్ డైనింగ్‌కు శ్రీకారం
- లక్నోవీ, హైదరాబాదీ రుచులతో ఆహార ప్రియులకు ప్రత్యేక ఆకర్షణ



**తొలివెలుగు, ఎల్బీనగర్ :** దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని గడ్డిఅన్నారంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ది నవాబ్స్' రెస్టారెంట్‌ను నిర్వాహకులు సయ్యద్ మోహినూద్దీన్, సయ్యద్ అయ్మాన్, సయ్యద్ హర్వాన్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు, కాలనీవాసులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆహార ప్రియులకు రాజసపు రుచులను పరిచయం చేయాలనే లక్ష్యంతో రెస్టారెంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. లక్నోవీ, హైదరాబాదీ శైలిలో తయారుచేసే వివిధ రకాల కబాబ్స్, ప్రత్యేక జాఫ్రానీ బిర్యానీ, ఇరానీ చాయ్‌తో పాటు నాణ్యమైన బేకరీ తినుబండారాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో భోజనం చేసేలా ప్రత్యేక డైనింగ్ సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. నాణ్యత, రుచి, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, కాలనీవాసులు, ఆహార ప్రియులు పాల్గొని రెస్టారెంట్‌ను సందర్శించారు.

# టీబీ రహిత సమాజమే లక్ష్యం

- ఉగ్గంపల్లి పీహెచ్‌సీలో క్షయ బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ
- వైద్యాధికారి డాక్టర్ కందుకూరి ప్రవీణ్

**తొలివెలుగు, చిన్నగూడూరు:** క్షయ (టీబీ) వ్యాధి భయపడాల్సిన రుగ్మత కాదని, క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కందుకూరి ప్రవీణ్ తెలిపారు. 'టీబీ ముక్త్ భారత్ పోషణ్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో 8 మంది బాధితులకు నెల రోజులకు సరిపడా పోషకాహార కిట్లు, ఉచిత మందులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ... టీబీ నివారణలో వాడే మందుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, కాబట్టి రోగులు త్వరగా కోలుకోవడానికి బలవర్ధకమైన ఆహారం ఎంతో అవసరమని చెప్పారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన దాతల సహకారంతో కిలో కందిపప్పు, గోధుమపిండి, వంటనూనె, 200 గ్రాముల మిల్ మేకర్, రెండు ప్రోటీన్ పౌడర్ ప్యాకెట్లు, నాలుగు కోడిగుడ్లతో కూడిన కిట్లను అందించినట్లు వివరించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, దాతలు ముందుకొచ్చి క్షయ రోగులకు చేయూతనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ఎల్‌టీ కోటేష్, ఫార్మాసిస్ట్ బాబురావు, ఆశా కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# 'ఒక్కో మొక్క నాటుదాం.. భావితరాలను కాపాడుకుందాం'





- శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా 'హరితోదయం' కార్యక్రమం
- మొక్కలను దత్తత తీసుకుని సంరక్షిస్తామని విద్యార్థుల ప్రతిజ్ఞ

**తొలివెలుగు, చౌటుప్పల్:** విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించి, ప్రకృతి సంరక్షణలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో చౌటుప్పల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం 'హరితోదయం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పలు రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ చైతన్య పాఠశాలల దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఏజీఎమ్ ఎం. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సొంత బిడ్డలా సంరక్షించినప్పుడే పచ్చని భవిష్యత్తుకు బలమైన పునాదులు పడతాయని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేతా బాన్స్, డీన్ దుర్గాప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గోపిచంద్, ప్రైమరీ ఇన్‌చార్జ్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. 'వృక్షో రక్షతి రక్షితః' అనే సందేశాన్ని విద్యార్థులకు వివరించి, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల ప్రాధాన్యాన్ని తెలియజేశారు.

**మొక్కలను దత్తత తీసుకున్న విద్యార్థులు:** కార్యక్రమం అనంతరం పాఠశాల ఆవరణలో నాటిన ప్రతి మొక్కను ఒక్కో విద్యార్థి దత్తత తీసుకుని, ప్రతిరోజూ నీరు పోస్తూ సంరక్షిస్తామని ఉపాధ్యాయుల సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థుల పర్యావరణ స్పృహ, మొక్కల సంరక్షణకు చూపిన నిబద్ధతను తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ధర్మారెడ్డి కాలువలో పారిన సాగునీరు

- భువనగిరి-నకిరేకల్ రైతుల చిరకాల స్వప్నం సాకారం
- వలిగొండ వద్ద నీటిని విడుదల చేసిన ప్రభుత్వ విప్ వీరేశం, ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి

**తొలివెలుగు, రామన్నపేట/వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ధర్మారెడ్డి కాలువ జీరో పాయింట్ వద్ద నుంచి దిగువ ప్రాంతాలకు సాగునీటిని మంగళవారం విడుదల చేశారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు పాల్గొని పూజలు నిర్వహించిన అనంతరం నీటిని కాలువలోకి వదిలారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ... భువనగిరి, నకిరేకల్ నియోజకవర్గాల రైతాంగ దశాబ్దాల ఆకాంక్ష అయిన ధర్మారెడ్డి కాలువ నీటిని విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పనులను వేగవంతం చేసి సాగునీరు అందించినట్లు తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో కాలువల ఆధునీకరణకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఈ కాలువ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, గతంలో నిధుల లేమి, నీటి కొరతతో అల్లాడిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ఊపిరి పోసిందని అన్నారు. ఇచ్చి హామీలన్నింటినీ ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# దమ్ముంటే పట్టుకోండి

"అయిపోయిందన్న ఆట.. ఖతమైపోయింది వాని పని.. చచ్చిపోయిండు వాడు.. పోలీసులేం చేస్తరు.. దమ్ముంటే పట్టుకోమను.. దొరికింది ఛాయిస్.. ఏసేసిన.. డీఎస్సార్ ఖత మ్ హోగయా.. చచ్చిపోయిండాడు.." అంటూ ఒక హత్యచేసి వచ్చిన తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లో లైవ్ పెట్టి తన స్నేహితులతో నవ్వుకుంటూ నిందితుడు అఫ్రోజ్ చెప్పిన మాటలివి. ఈ వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతూ సంచలనం సృష్టిస్తోంది. హైదరాబాద్ మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి జరిగిన సూరి హత్య కలకలం రేపింది. పాతనేరస్తుడైన నందనవనం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ సూరి ప్రత్యర్థుల చేతిలో దారుణహత్యకు గురయ్యాడు. మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాల సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పాతకక్షల నేపథ్యంలో మాజీ రౌడీ షీటర్ సల్మాన్ సోదరుడు అఫ్రోజ్.. సూరిని పథకం ప్రకారం హతమార్చాడు. గతంలో తన భార్యతో పాటు బావమరిది సల్మాన్ హత్యకేసుల్లో నిందితుడుగా జైలుకు వెళ్లి వచ్చాడు. అతని నేరచరిత్రను దృష్టిలో పెట్టుకుని కొన్ని నెలల క్రితమే సూరిని పోలీసులు నగరబహిష్కరణ చేశారు. సూరిని ఎలాగైనా చంపేయాలని కక్ష పెంచుకున్న అఫ్రోజ్ అతనితో స్నేహం చేస్తున్నట్లు నటించాడు. ఈక్రమంలో సూరి తన రెండోభార్య తమ్ముడి పుట్టినరోజు వేడుకల కోసం నందనవనానికి రావడంతో ప్లాన్ ప్రకారం అతనిపై పెప్పర్ స్ప్రే చల్లి అనంతరం కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. తీవ్రగాయాల పాలైన సూరిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు.



# మాదకద్రవ్యాల నిరోధానికి కఠిన చర్యలు

- చిన్నగూడూరు, ఉగ్గంపల్లిలో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు
- గంజాయి, మత్తు పదార్థాలపై నిరంతర నిఘా: ఎస్ఐ కుశకుమార్

**తొలివెలుగు, చిన్నగూడూరు :** మండలంలో మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నట్లు చిన్నగూడూరు ఎస్ఐ కుశకుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం పోలీసు సిబ్బందితో కలిసి మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నగూడూరు, ఉగ్గంపల్లి గ్రామాల్లో నార్కోటిక్ డాగ్ 'మాక్స్' సహాయంతో అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వలపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం లేదా రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేసి ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు, నిఘా చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఎస్ఐ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఆగస్టు 17న 'చలో కలెక్టరేట్'ను జయప్రదం చేయాలి

- వృత్తి కళాకారుల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్
- ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్ పిలుపు




**తొలివెలుగు, రామన్నపేట :** గ్రామీణ వృత్తి కళాకారుల సమస్యలను పరిష్కరించి, ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 17న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే 'చలో కలెక్టరేట్' మహాధర్నాను విజయవంతం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం రామన్నపేటలో నిర్వహించిన ప్రజానాట్యమండలి మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వృత్తి కళాకారులు తీవ్రమైన ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో కళాకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. వృత్తి కళాకారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహించే 'చలో కలెక్టరేట్' కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వృత్తి కళాకారులు, ప్రజా కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**మండల అధ్యక్షుడిగా బర్రె మధు ఎన్నిక :**

ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రామన్నపేట మండల నూతన అధ్యక్షుడిగా బర్రె మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో మండల కార్యదర్శి గంటెపాక శ్రీకృష్ణ, నకిరేకంటి సురేష్, మజ్జురి సాయి, మేడి పృథ్వి, మేడి వెంకన్న, కనుకుంట్ల ఉపేందర్, కొండగడప చరణ్, బూడిద ఆదిత్య, తుర్కపల్లి లోకేష్, జిట్ట రాజేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యా-శాఖ మంత్రి రాజీనామా చేయాలి



- 'నీట్' లీకేజీపై వలిగొండలో సీపీఎం నిరసన హోరు
- విద్యార్థులపై దాడి దుర్మార్గం: సిర్పంగి స్వామి
- మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్

**తొలివెలుగు, వలిగొండ:** నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు బాష్పవాయు గోళాలు, రబ్బర్ బుల్లెట్లు ఉపయోగిస్తూ పాశవికంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ సీపీఎం జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం వలిగొండ మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పంగి స్వామి మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు 19 సార్లు వివిధ పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకయ్యాయని, ఇది విద్యా రంగం పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంతో మనస్తాపానికి గురై దేశవ్యాప్తంగా 19 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ. కోటి చొప్పున పరిహారం అందించాలని, నీట్ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, మండల కమిటీ సభ్యుడు కొండె క్రిష్టయ్య, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు శీలం ఇందిర, కర్నాటి మత్స్యారాణి, కొండూరు సత్తయ్య, వేముల లక్ష్మయ్య, ద్యానబోయిన యాదగిరి, చేగూరి నరసింహ, పెద్దబోయిన భీమరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి: సీపీఎం

- లాఠీచార్జ్ అమానుషం.. భూదాన్ పోచంపల్లిలో ధర్నా



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని సీపీఎం నాయకులు దుబ్బాక జగన్, కోట రామచంద్రరెడ్డి విమర్శించారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలోని నేతాజీ చౌరస్తా వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యాభ్యాసంతో ఆడుకుంటూ విద్యార్థుల జీవితాలను బలిచేస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులపై నమోదు చేసిన కేసులను తక్షణమే రద్దు చేయాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీపై ప్రత్యేక విచారణ జరిపించడంతో పాటు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ప్రసాదం విష్ణు, మంచాల మధు, బుగ్గ లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, అలీ రజినీకాంత్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.




## చేనేత కార్మికుల స్థితిగతుల పరిశీలన

- పోచంపల్లిలో పర్యటించిన తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ
- చేనేత అభివృద్ధికి ప్రత్యేక విధివిధానాలు రూపొందించాలని విజ్ఞప్తి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి చేనేత కార్మికుల జీవన స్థితిగతులు, పరిశ్రమ ప్రస్తుత పరిస్థితిని తెలుసుకునేందుకు తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మంగళవారం భూదాన్ పోచంపల్లిలో పర్యటించారు. చేనేత రంగ నిపుణులు తడక యాదగిరి ఆధ్వర్యంలో ఆయన చేనేత కార్మికుల ఇళ్లను, మగ్గాలను సందర్శించి వారి పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు, కార్మికుల ఆర్థిక ఇబ్బందులు, ఉపాధి సమస్యలను ప్రొఫెసర్ వెంకటనారాయణకు వివరించారు. పోచంపల్లి చేనేతకు పూర్వవైభవం తీసుకురావడంతో పాటు కార్మికుల సంక్షేమానికి అవసరమైన ప్రత్యేక విధివిధానాలను రూపొందించేలా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులతో ప్రొఫెసర్ వెంకటనారాయణ మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పోచంపల్లి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు, సహకార సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు

- చేనేత కార్మికులకు కంటి వైద్య పరీక్షలు
- ప్రొడ్యూసర్ కంపెనీ సేవలు అభినందనీయం




**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** వివిధ సంస్థలు, ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పట్టణ ప్రజలు, చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని పురపాలక చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పోచంపల్లి పట్టణంలోని పద్మశాలి చేనేత కార్మిక సంఘం భవనంలో పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ, నేత్రాలయ కంటి ఆసుపత్రి సౌజన్యంతో చేనేత కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్, ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ తడక రమేష్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ తడక రమేష్ మాట్లాడుతూ... సామాజిక బాధ్యతగా తమ కంపెనీ ఆధ్వర్యంలో సుమారు 200 మంది చేనేత కార్మికులకు కంటి పరీక్షలు చేయించామని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడంతో పాటు, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి 50 శాతం సబ్సిడీతో ఆపరేషన్లు చేయిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చింతకింది రమేష్, కౌన్సిలర్ కొండమడుగు ఎల్లస్వామి, సీత సత్యనారాయణ, కర్నాటి అంజమ్మ, వలందాస్ ప్రవీణ్, బొమ్మ హరిశంకర్, రుద్ర సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వేముల వీరేశంకు రాష్ట్ర మంత్రి హోదా

- జీవో ఆర్టీ నెం.1064 జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**తొలివెలుగు, రామన్నపేట :** ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు రాష్ట్ర మంత్రి హోదా కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీవో ఆర్టీ నెం.1064 ద్వారా అధికారిక ఆదేశాలు వెలువరించారు. ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర వారెంట్ ఆఫ్ ప్రిసిడెన్స్‌లోని ఆర్టికల్--18 నిబంధనల మేరకు రాష్ట్ర మంత్రి హోదాకు సంబంధించిన అన్ని అధికారిక ప్రోటోకాల్‌లు, మర్యాదలు, సౌకర్యాలు వేముల వీరేశంకు వర్తించనున్నాయి. శాసనసభలో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తున్నందుకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ హోదా కల్పించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. వేముల వీరేశంకు రాష్ట్ర మంత్రి హోదా దక్కడం పట్ల నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. రామన్నపేటతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మిఠాయిలు పంచుకుని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వీరేశంకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు


- రామన్నపేట సుభాష్ సెంటర్‌లో కేక్ కట్ చేసిన కాంగ్రెస్ శ్రేణులు
- ఖర్గే నాయకత్వంలో పార్టీ బలోపేతం: నేతలు



**తొలివెలుగు, రామన్నపేట:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను మంగళవారం మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... మల్లికార్జున ఖర్గే సమర్థవంతమైన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా మరింత బలపడుతోందని పేర్కొన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు పున్న జగన్మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జమీరుద్దీన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జెల్లా వెంకటేష్, గుత్తా నర్సిరెడ్డి, వనం చంద్రశేఖర్, సాల్వేర్ అశోక్, శంబాల వెంకన్న, మహమ్మద్ నాసర్, రాయిని రమేష్, కోట సుధాకర్, లక్ష్మణ్, మహమ్మద్ రిజ్వాన్, బండ అంజిరెడ్డి, ఏటేల్లి పరమేశ్, లెంకల ప్రవీణ్, మహమ్మద్ అజార్, శోభ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించాలి


- రామన్నపేటలో బీఎల్‌ఏలతో ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం
- చివరి దశలోనూ అప్రమత్తంగా పనిచేయాలి: ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య



**తొలివెలుగు, రామన్నపేట :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) అప్రమత్తంగా పనిచేయాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సూచించారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలో బీఎల్‌ఏలతో నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ.. ఇప్పటివరకు అంకితభావంతో పనిచేసిన పార్టీ కార్యకర్తలు, బీఎల్‌ఏలు చివరి దశకు చేరుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కూడా అదే నిబద్ధతతో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచనల మేరకు ప్రతి అర్హుడి ఓటు నమోదయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహణలో యాదాద్రి భువనగిరి జిల్లా ముందంజలో ఉండడం అభినందనీయమన్నారు. ప్రజా పాలనలో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు అందజేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ మువ్వా విజయ్‌బాబు, ఈఆర్‌ఓ లెవల్ కోఆర్డినేటర్ చామల శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు

- ఆత్మకూరు(ఎమ్)లో 100 శాతం ఓటరు మ్యాపింగ్ పూర్తి చేసిన బీఎల్‌ఏలకు సన్మానం
- ప్రోత్సాహక నగదు బహుమతి అందజేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎమ్):** కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకూ రాబోయే రోజుల్లో మంచి గుర్తింపు, భవిష్యత్తు ఉంటాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. ఆత్మకూరు(ఎమ్) మండలంలో 100 శాతం ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్‌ఏ) మంగళవారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏలను ప్రభుత్వ విప్ ప్రత్యేకంగా అభినందించి, ప్రోత్సాహకంగా నగదు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో బీఎల్‌ఏలు చూపిన చొరవ అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారెడ్డిపల్లి కాలువలో సాగునీటి విడుదల





- ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యేలు కుంభం, వేముల
- డిసెంబరు నాటికి పనులు పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**తొలివెలుగు, వలిగొండ :** భువనగిరి నియోజకవర్గ రైతాంగం చిరకాలంగా ఎదురుచూస్తున్న సంగెం ధర్మారెడ్డిపల్లి కాలువలో సాగునీటి విడుదల పండుగ వాతావరణంలో జరిగింది. వలిగొండ మండలంలోని సంగెం వద్ద ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలతో కలిసి కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీటిని విడుదల చేశారు.

**16 నెలల్లోనే సగానికి పైగా పనులు..**

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు రూ. 125 కోట్ల వ్యయంతో చేపట్టిన ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల్లోనే సగానికి పైగా పూర్తి చేసిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టును వేగవంతం చేసి రైతులకు నీరందించే స్థాయికి తీసుకువచ్చామన్నారు. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి కాలువ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో ముగించి వేలాది ఎకరాలకు శాశ్వతంగా సాగునీటిని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.

**రైతు సంక్షేమానికి ప్రాధాన్యం..**

ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. కాలువ నిర్మాణంతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ, డిఈ అధికారులు, వలిగొండ మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# 'ఆరెగూడెం'కు నిఘా నీడ.. ప్రజల భద్రతకే సీసీ కెమెరాలు!

- వివిఆర్ ఆర్గానిక్స్ సామాజిక బాధ్యతకు పోలీసు శాఖ ప్రశంసలు
- అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సీసీ కెమెరాల ప్రారంభం
- గ్రామాన్ని సురక్షిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరం

**తొలివెలుగు, చౌటుప్పల్:** గ్రామాల్లో నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామంలో వివిఆర్ ఆర్గానిక్స్ యాజమాన్యం సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ఏర్పాటు చేసిన ఆధునిక సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను జిల్లా అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**సురక్షిత గ్రామం దిశగా కీలక అడుగు:**

ఆరెగూడెం గ్రామంలో ప్రధాన కూడళ్లు, రహదారులు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ భద్రత మరింత బలోపేతం కానుందని అధికారులు తెలిపారు. ఆధునిక నిఘా వ్యవస్థతో గ్రామంలో జరిగే ప్రతి కదలికపై పర్యవేక్షణ ఉండటంతో నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో భయం నెలకొంటుందని, శాంతిభద్రతల పరిరక్షణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

**నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం:**

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కాలానుగుణ అవసరంగా మారిందన్నారు. సీసీ కెమెరాల వల్ల దొంగతనాలు, గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ఇతర నేరాలను అరికట్టడంలో పోలీసులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. నేరం జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించేందుకు కూడా ఇవి ఎంతో దోహదపడతాయని వివరించారు. "గ్రామాల్లో సీసీ కెమెరాల నిఘా ఉండటం వల్ల నేరస్థుల్లో భయం పెరుగుతుంది. దొంగతనాలు అరికట్టబడి ప్రజలు నిర్భయంగా జీవించగలుగుతారు. గ్రామ భద్రత కోసం ముందుకొచ్చిన వివిఆర్ ఆర్గానిక్స్ యాజమాన్యాన్ని, గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ ఎన్నెపెల్లి ధనలక్ష్మి వెంకట్ రెడ్డిని అభినందిస్తున్నాను." అని అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు.

**వివిఆర్ ఆర్గానిక్స్ సేవలు అభినందనీయం:**

గ్రామాభివృద్ధి, ప్రజా భద్రత కోసం వివిఆర్ ఆర్గానిక్స్ సంస్థ సామాజిక బాధ్యతతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అదనపు ఎస్పీ కొనియాడారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రైవేట్ సంస్థలు కూడా ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం వల్ల గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చే సంస్థలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

**పర్యావరణ పరిరక్షణకు పోలీసుల సందేశం:**

సీసీ కెమెరాల ప్రారంభోత్సవం అనంతరం అధికారులు స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ సందర్భంగా సందేశమిచ్చారు. విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, సీఐ మన్మథ కుమార్, ఎస్సై నర్సిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఎన్నెపెల్లి ధనలక్ష్మి వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ నిర్మల సూర్యనారాయణ, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పోలీసు సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వివిఆర్ ఆర్గానిక్స్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థతో ప్రజల్లో భద్రతాభావం మరింత పెరుగుతుందని, నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో ఇది సమర్థవంతమైన చర్యగా నిలుస్తుందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.







# డ్రగ్స్‌కు స్వస్తి చెబితేనే ఉజ్వల భవిష్యత్తు

- చౌటుప్పల్‌లో ఘనంగా 'యాంటీ డ్రగ్స్' అవగాహన సదస్సు
- మాదకద్రవ్యాల నిర్మూలనకు వందలాది మంది విద్యార్థుల ప్రతిజ్ఞ
- హాజరైన అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ మధుసూదన్ రెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్ :** "డ్రగ్స్‌కు 'నో' చెప్పండి... ఉజ్వల భవిష్యత్తుకు 'యెస్' చెప్పండి" అనే నినాదంతో సమాజంలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలోని వీవీఆర్ గార్డెన్స్‌లో సీఐ జి.మన్మథ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతకు భారీ 'యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, చౌటుప్పల్ డీఎస్పీ పటోళ్ల మధుసూదన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**తాత్కాలిక ఆనందం.. శాశ్వత నష్టం:**

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు మానవాళికి తీవ్ర ముప్పుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్షణికావేశంలో లేదా సరదా కోసం చెడు అలవాట్లకు బానిసలైతే పవిత్రమైన విద్యార్థి జీవితం, కుటుంబ గౌరవం, బంగారు భవిష్యత్తు కాలిబూడిదవుతాయని హితవు పలికారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా చట్టపరమైన సమస్యలతో భవిష్యత్తులో ఉద్యోగాలు, అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు.

**పోలీసులకు సమాచారమివ్వండి - వివరాలు గోప్యంగా ఉంచుతాం:**

డీఎస్పీ పటోళ్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగం వంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే యువత భయం లేకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. యువత సరైన మార్గంలో పయనిస్తూ ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

**ఐక్యంగా విద్యార్థుల ప్రతిజ్ఞ..**

సదస్సుకు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. మత్తు రహిత సమాజం కోసం తమ వంతు కృషి చేస్తామని, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడతామని సభామండపంలో అందరూ ఐక్యంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, కౌన్సలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పోలీస్ అధికారులు, పలు కళాశాలల యాజమాన్యాలు, స్థానిక యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీ సరళ మైసమ్మ ఆలయ నిర్వహణలో పారదర్శకత ఉందా..?

- ఆలయ నిర్మాణం, విరాళాల లెక్కలపై స్పష్టత కోరుతున్న భక్తులు
- హుండీ ఆదాయం, టెండర్లు, టోకెన్ల నిర్వహణపై విచారణ జరపాలని విజ్ఞప్తి
- 2012 నుంచి ఆదాయ-వ్యయ వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్

**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 84, 85లో ఉన్న శ్రీ సరళ మైసమ్మ దేవాలయ నిర్వహణ, నిర్మాణం, హుండీ ఆదాయం, విరాళాల వినియోగం, టెండర్లు, టోకెన్ల నిర్వహణ తదితర అంశాలపై పూర్తి పారదర్శకత పాటించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. స్థానికంగా అందుతున్న సమాచారం మేరకు 2012 ప్రాంతంలో చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆలయం పేరిట ఒక సొసైటీ ఏర్పాటు చేసి నూతన ఆలయ నిర్మాణం చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ నిర్మాణానికి అవసరమైన అనుమతులు, అనుసరించిన విధివిధానాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. అదేవిధంగా ఆలయ నిర్మాణం కోసం భక్తుల నుంచి సేకరించిన విరాళాల మొత్తం ఎంత, ఆ నిధులను ఏయే పనులకు ఎంత మేర వినియోగించారు, ప్రస్తుతం మిగిలిన నిధుల వివరాలు ఏమిటనే సమాచారాన్ని బహిరంగంగా వెల్లడించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. 2012 నుంచి 2026 వరకు ఆలయ హుండీలలో భక్తులు సమర్పించిన నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు, కానుకల వివరాలు, హుండీ లెక్కింపు ప్రక్రియ, ఆదాయ-వ్యయ లెక్కలు, ఆడిట్ నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా అనే అంశంపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ఆలయ నిర్వహణ బాధ్యతలు ప్రస్తుతం ఎవరి వద్ద ఉన్నాయి, నిర్వహణ కమిటీ లేదా సొసైటీ సభ్యులు ఎవరు, వారి నియామక విధానం ఏమిటి, దేవాదాయ శాఖతో వారి సంబంధం ఏమిటనే వివరాలను కూడా బహిరంగంగా ప్రకటించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఆలయంలో అమలవుతున్న టెండర్లు, పార్కింగ్, టోకెన్లు, ఇతర సేవలకు సంబంధించిన రుసుములు సంబంధిత శాఖల అనుమతులతోనే వసూలు చేస్తున్నారా అనే అంశాన్ని అధికారులు పరిశీలించి ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నారు. ఈ అంశాలపై జిల్లా కలెక్టర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, సంబంధిత రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించడంతో పాటు అవసరమైతే ఆదాయ-వ్యయాలకు సంబంధించిన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని భక్తులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

